136

136

# స్త్రీ పాటలు

REGISTRAR OF
10 MAY 1943
MADRAS

136
1943
P No 24
Sl no 38

"చైతన్య స్రవంతులన్ పూరించి, పొంగించి
విప్లవజ్వాలలన్ వినువీధి నెక్కించి,
ఉద్యమాల్ ఉత్సవాల్ వూగించి, సాగించి.
వేలాది వేలనే, కోటాన కోట్లనే
అదలించి, కదలించి, నడిపించి, ఉరికించి
కదనసీమకు దారిత్రొక్కవే సోదరీ!!"

Sl No. 193
Acc No 6709

ప్రజాశక్తి కార్యాలయం
:: బెజవాడ ::

# స్త్రీల పాటలు

OFFICE OF THE REGISTRAR OF ...
10 MAY 1943
MADRAS

సంపాదకులు:

## కృష్ణాజిల్లా మహిళాసంఘం.

★

193
6709.

ప్రజాశక్తి కార్యాలయం
బెజవాడ.

ప్రజాశక్తి ప్రచురణ 15

ఏప్రియల్ 4

## ప్రస్తావన

సామాజికంగా, రాజకీయంగా వెనుకబడియున్న మహిళాప్రపంచానికి ఘరోవిపత్తు తొంగిచూస్తోంది. జపానుఫాసిజం మన పొలిమేరలలో కాచుకొనివుంది. అందుచే, ఆంధ్రమహిళలను సామాజికంగా, రాజకీయంగా అభ్యున్నతికి కొంపోవడానికి, నేటి ప్రమాదాన్ని ఎదుర్కొనగల ఆత్మవిశ్వాసాన్ని కల్పించడానికిగాను ఈప్రచురణకు పూనుకొన్నాం.

స్త్రీలలో పూర్వంనుండి ప్రచారంలోనున్న పద్ధతులలోను, నేటి పద్ధతులలోను విరివిగా చక్కని పాటలను వ్రాసి—రచయితలకు ఒక కొత్తవంధా చూపిన కామ్రేడ్ ముక్కామల నాగభూషణంగారికి ప్రథమ బహుమానం ఈయబడింది. "సోదరీమణులార స్థిరచిత్తులార" అనే దంపుళ్లపాట, జోలపాట, మంగళహారతిపాట ముఖ్యంగా గమనింపదగ్గవి.

లలిత, నారాయణమ్మ, ఉమాగాయిత్రి గారల వ్రాతలుచూస్తే, కవయిత్రులలో ఎట్టి చైతన్యం, ఎట్టి అభివృద్ధి వచ్చిందో కన్పించుతుంది. ఉమాగాయిత్రిగారి "పిలుపు" ఎంతో ఉత్తేజకరంగా వుంది. ఆమెకు ద్వితీయ బహుమానం ఈయబడింది.

పాడేవారికి సూచన: పాటలన్నీ సమిష్టిగా పాడాలి. పద్యాలు చక్కనికంఠం వున్నవారు ఒక్కరుపాడినా ఫర్వాలేదు. "మంత్రాలలో నేమున్నది" అనులాంటి పాటలను స్థానిక పరిస్థితులు తెలిసికొని పాడాలి. అసలు మహిళాసంఘాలకే దూరమైపోయే పరిస్థితులను కల్పించరాదు.

ఈపాటలను ప్రచురించే బాధ్యతను తీసుకొని సహాయపడ్డ కమ్యూనిస్టుపార్టీ ఆంధ్రకమిటీకి కృతజ్ఞులం.

మానికొండ సూర్యావతి,

అధ్యక్షురాలు, కృష్ణాజిల్లా మహిళాసంఘం.

మూడణాలు

ప్రజాశక్తి ప్రెస్ - బెజవాడ



OFFICE OF THE REGISTRAR OF BOOKS
10 MAY 1943
MADRAS

## ఎన్నాళ్లీ బానిస బ్రతుకు

1) ఎన్నాళ్లీగతి బానిసబ్రతుకూ, యోచనజేయరదేలా
మూన్నాళ్లైనను స్వేచ్ఛగ బ్రతుకుటె, మేలని యెంచరదేలా॥

2) కూడు గుడ్డలవిలేకను గుండెడి, పాటక జనములగనరా
ఎంగిలియాకులనాకి బ్రతుకువారేడ్పులు మీరికవినరా॥

3) సర్వసంపదల నిలయము భారతభువియని తెలియగలేరా
అట్టి దేశమున బుట్టిన మనకిక బానిసబ్రతుకేగతియా॥

4) సకలబలంబులగూర్చి శత్రువును జీల్చి స్వతంత్రమువేగ
సంపాదింపగ సాగిరండు ఘనసమరోత్సాహముతోడ॥ ఎన్నా॥

— ముక్కామల నాగభూషణం

# విజయ ఢంకా

రమణీ మండలి । విజయ ఢంకా
ఘనతరంబుగ । మ్రోగుచుండెను
తెల్గు రమణీ । తెలిసికొని
వీరత్వమున । విలసిల్లుమా ॥రమణీ॥ ౧

మొగలుసామ్రాట్టు । యిన అక్బరు
మొరకు తనమును । రూపుమాపి
విజయ శ్రీ విల । సాంకేతంబగు
శౌర్యఖని శ్రీ । దుర్గ మొదలగు ॥రమణీ॥ ౨

పిరికితనమున । యుద్ధభూమిని
వీడి పరుగిడి । వచ్చు భర్తను
"పిరికివాండ్రకు । చోటులేదని"
కోటతలుపుల । మూసివేసిన
శౌర్యఖని మహా।మాయ మొదలగు ॥రమణీ॥ ౩

భాగ్యఖని మే । వాడ రాజ్యపు
దుర్గతిని పో । గొట్ట విషముచె
ప్రాణముల బలి । నిచ్చి దేశపు
ఋణము దీర్చిన । కృష్ణ మొదలగు ॥రమణీ॥ ౪

ఖడ్గతిక్కన । కత్తికదనము
కరకు తనమును । వీడి విడచిన
భీరుడని ఏం । దించి విజయము
పొందపంపిన । పత్ని మొదలగు ॥రమణీ॥ ౫

సమర భూమిని । నురికి వీరత
బ్రిటను సింహము । జూలువట్టి
సాహసంబున । చక్కనడచిన
సమరసింహిక । ఝాన్సి మొదలగు ॥రమణీ॥ ౬



ఘనముగా సత్యాగ్రహంబను
కరకు యుద్ధము । నందు నిల్చి
లాఠిదెబ్బల ।ధాటికోర్చి
తుపాకిగుండ్లకు । గుండె జూపిన ॥రమణీ॥ ౭

— శెట్టిపల్లి వెంకటరత్నం

# మనది భారత దేశం

మనది భారతదేశమమ్మా
మనది భారత జాతి తల్లి
భారతీయులము మనమమ్మా
బానిసలమైనాము తల్లీ
బానిసలమైపోయినాము
పరులచేతికి చిక్కినాము
పాటుపడి పండించుతాము
పరులకే దోచిపెడతాము
మనము ముప్పైఏడుకోట్లు
జనము ముప్పైఏడుకోట్లు
పద్దెందిలక్షలా మైళ్ల
నలచదరమున్నదీ భూమి
మూడువైపుల సంద్రముందీ
మొనగాడి కొండలున్నాయి
చిత్రచిత్రపు కొండలామ్మా
జీవనౌషధులు గలవమ్మా
పెద్ద సెలఏండ్లున్నవమ్మా
జీవనదులేగలవు తల్లీ
ఎడతెగకపారేటి ఏటిమొత్తాలతో
బంగారు పండేటి పంటపొలాలతో
పసిరికాటీళ్ళతో ఫలవనమ్ములతోను

భూలోకస్వర్గమేనమ్మా ॥మనది॥
భోగాలపుట్టినిల్లమ్మా

పాడిపంటలతోను బలపడినదేశము
భాగ్యభోగ్యాలతో పరిఢవిల్లిన జాతి
పౌరుషజ్ఞానాలు, గౌరవయశస్సులూ
విశ్వవిఖ్యాతిగా వెలిగించిన భూమి
వీరరుద్రమదేవి. ధీరదుర్గారాణీ
రాణాప్రతాపుడూ, రసపుత్రవీరులూ
తమ శౌర్యమయ రక్తధారాస్రవంతితో ॥మనది॥
తడిపిమెదిపిన వీరధాత్రియిది మాతల్లి

వీరులూ పుట్టినా భూమి
శూరులూ మెట్టినా భూమి
వీరాధివీరులూ వీరనారీమణులు ॥మనది॥
పుట్టిపెరిగినట్టి భూమియిది మాతల్లి

సైనిక పరాజయము సంభవించిన గూడ
అభిమానధనముతో ఆత్మశక్తితోను
స్వాతంత్ర్యకాంక్షతో జాతిపౌరుషముతో
గ్రీకుసామ్రాట్టునే గిజగిజా లాడించు ॥మనది॥
పురుషోత్తమునకు తోబుట్టులము మాతల్లి

పద్దెందివందలాయాభై పైన ఏడోవత్సరంబు
భారతీయుల పౌరుషమ్మూ
ప్రజ్వలించిన తరుణమ్ము
భారత స్త్రీ పౌరుషమ్ము
స్త్రీ జాతిలోని సైన్యాలు
స్త్రీ జాతి వాహినీపతులు
భారత స్త్రీల మేధస్సూ
కంపెనీ సైన్యాన్ని గగ్గోలుపరిచాయి
పాశ్చాత్య విజ్ఞానపటిమ నెదిరించాయి
స్త్రీ శక్తి తక్కువాతల్లీ



స్త్రీ దుర్బలాంగి కాదమ్మా
మేధస్సు లేకపోలేదు
మేధావినీ గాకపోదు
నినునీవు వంచించుకోకు
నీకునీవై బేలుపడకు
స్త్రీ చేతకానిపని సృష్టిలోనేలేదు
స్త్రీ ప్రాణశక్తి యీ సృష్టికంతటికినీ ॥మనది॥

నిర్బంధ శాసనాలన్నీ
నిర్బంధపెట్టాయి స్త్రీని
కష్టసహిష్ణుతా, కార్యనిర్వహణతా
కరుణాసమృద్ధతా కలవు మా స్త్రీలకని
చాటినది మన ఝాన్సి లక్ష్మి
సందేశ మిచ్చింది మనకు
ఝానిసీ లక్ష్మి మాయమ్మా
చండికా రూపమే తల్లీ
మూర్తిదాల్చిన శౌర్య రాసి
మోహనాకారంపు బొమ్మ
పౌరుషమ్ముల పుట్టినిల్లూ
బాహుబల సంపద కొఠారు
పద్దెనిమిదీ ఏళ్ళ వయసూ
రాజ్యాంగనేత్రి మాయమ్మా
రణ ధర్మనిపుణ మాతల్లీ
రావు గంగాధరుని రాణి
ఝాన్సీకోటకు మహారాణి
ఆణి ముత్తెములాంటి తల్లీ
ఆపన్నులకు కల్పవల్లీ
ఆడజాతికి గమ్యరేఖ
అఖిలభారత చంద్రరేఖ
జాతి స్వతంత్రతా సంరక్షకోసమై
ఈస్టిండియా మిలిటరీఫోర్సునుదికించి

వీరధర్మముజూపి మరణించినదతల్లి
కంపెనీ సైన్యాన్ని గగ్గోలుపరిచింది
భారతస్త్రీ ఆత్మగౌరవంబెట్టిదో
భారతస్త్రీ యశః ప్రాశస్త్యమెట్టిదో
భారతస్త్రీ శౌర్యపాటవంబెట్టిదో
భారతీయాంగనా ప్రాభవంబెట్టిదో
భరతజాతి స్త్రీల పౌరుషములెట్టివో
స్వర్ణాక్షరములతో శాసనాల్ వ్రాయించి
దిక్కుంభికుంభాగ్ర దేశాలకట్టింది
మనకామె తోబుట్టువమ్మా
మనమామె చెల్లెండ్రమమ్మా
మనజాతికోసమై
మన హక్కుకోసమై
మన ఝూనిసీరాణి మరణించినది తల్లి
మన రక్త సంబంధి మరణించెనోయమ్మ
స్వాతంత్రకాంక్షతో చచ్చిపోయినదామె
జాతిగౌరవయశశ్శాంతి భద్రతలను
కాపాడుకొన మనకు కర్తవ్యమున్నదీ
చావెన్నటికి తప్పబోము
శాశ్వతముగా బ్రతుకబోదు
జాతి సంరక్షకై, స్వాతంత్ర్య రక్షకై
చచ్చిపోండీ, వృధా చచ్చిపోనేమిటికి ?
బానిసత్వమ్ముతో క్రుగ్గిపోనేమిటికి ?
కృశియించి కృశియించి కూలిపోనేమిటికి ?
జీవచ్ఛవమ్ముపై జీవింపనేటికని
ఝాన్సీమహరాణి సందేశమిచ్చింది
మనకామె తోబుట్టువమ్మా ॥మనది॥

అదిగో ఝాన్సీ మహరాణి
ఆమెయే ఝాన్సీ లక్ష్మి
అదిగో ధవళాశ్వాధిరూఢ



మూపుపై పసిబిడ్డసుమ్ము
మోముపై దివ్య తేజమ్ము
కుడిచేతిలోన బల్లెమ్ము
నడుమునకు ధీరఖడ్గమ్ము
ఎడమచే ఘోటికల్లెమ్ము
యొడలెల్ల నెత్తుటిమయమ్ము
ఆమెయే ఝూనిసీలక్ష్మి
అదిగో ధవళాశ్వాధిరూఢ
మనకామె తోబుట్టువమ్మా
మనమామె చెల్లెండ్రమమ్మా
స్త్రీ వంటయింటికై సృష్టింపబడినదో
స్త్రీ విలాసమునకై చిత్రింపబడినదో
స్త్రీ దాస్యవృత్తికై చేతనంబైనదో
చెప్పవేమాయమ్మ చెప్పవేమాతల్లి ॥మనది॥

కుమరసింహుని చూడవమ్మా
గుర్రాన్ని చూడవేతల్లీ
కుడిభుజము కూలిపోయింది
కుడిచేయి తెగిపోయెనమ్మా
ధారగట్టిన నెత్తురదిగో
తడిసిపోయిన దుస్తులవిగో
సత్తువుడిగినచేయి కత్తితోనరికేసి
గంగాప్రవాహాన కదుగుకుంటున్నాడు
వీరరక్తాన్ని భాగీరథీ నదిజేర్చి
భారతక్షేత్రాలు పదునుబెట్టించాడు
మన సోదరుడె వాడుతల్లి
మనకు తోబుట్టువేనమ్మా ॥మనది॥

మన బాలచంద్రుడూ మన ఖడ్కతిక్కనా
మన్యంపువీరులూ మనరెడ్డిరాజులూ
మన జాతికోసమై మన హక్కుకోసమై
ప్రాణాలు ధారవోశారు మేనులే బలియిచ్చిరమ్మా ॥మనది॥

పదిహేనువత్సరాల్ పాలబుగ్గలవయసు
పసినిమ్మపండులా మిసమిసల్‌గలమోము
వేడిరక్తపుపొంగు లెగజిమ్మునేత్రాలు
అతడె మనచిట్టితమ్ముడూ వాడె మనచంద్రశేఖరుడు
పబ్లీకుకోర్టులో పల్కుచున్నాడెదో
ఆజాదు తననామమంట అనిశత్రునిర్భయుండంట
నాజాతికోసమై నాహక్కుకోసమై
ప్రాణాన్ని తృణముగా ఫణముపెట్టేస్తాను
సామ్రాజ్యవాదాన్ని సదమదంజేస్తాను
కుటిలరాజ్యాంగాన్ని కూల్చిపారేస్తాను
అని ప్రతిజ్ఞనుబట్టినాడు
అదియె ముహూర్తమన్నాడు
కొనవూపిరుండగా ననుబట్టుకొనువాడు
పుట్టలేదన్నాడు పుట్టబోరన్నాడు
అతడె మనచిట్టితమ్ముడు
వాడె మన చంద్రశేఖరుడు
ఆల్ప్రేడ్డుపార్కులో ఆచెట్టునీడనే
పిస్తోళ్ళు పేల్చివేశారు ఫెళఫెళల్ భోరుకొలిపారు
దెబ్బదెబ్బకు బదుల్ తీర్చివేస్తున్నాడు
పాటవంపోయినా పౌరుషంపోలేదు
బదులు భర్తీచేసి ప్రాణాలువదిలాడు
మనదేశవీరుడూ మనజాతిశూరుడూ
మనభారతక్షేత్ర మకుటాయమానుడూ
మనజాతికోసమై మనహక్కుకోసమై
మనచంద్రశేఖరుడు మరణించినాడమ్మ
మనచిట్టితమ్ము నొకసారిస్మరింపుమా
మనది భారతదేశమమ్మా ॥మనది॥

మన సీతరామరాజమ్మా
మన్యంపువీరుదే తల్లి
రవికృంగనట్టి సామ్రాజ్యాధిపత్యాన్ని



అధికారమందున్న ఆంగ్లప్రభుత్వాన్ని
గడగడావణికించినాడు కంగారులోముంచినాడూ
ఏకైకవీరుడవ్వాడూ
మనజాతికోసమై మనహక్కుకోసమై
జాతిస్వతంత్రతా సంరక్షకోసమై
ఆత్మార్పణము చేసినాడూ
ఆంధ్రులను మేలుకొలిపాడూ
మంత్రగాడన్నారు-తంత్రగాడన్నారు
మాయమైపోతాడు-మహనీయుడన్నారు
పట్టుకుందామంటె పట్టుబడడన్నారు
బారు ఫిరంగులే పనిచేయవన్నారు
సాయుధబలాలను. నిరాయుధు డెదిర్చాడు
తన గెరిల్లా యుద్ధధాటి సామ్రాజ్యాన్ని
గడగడావణకించినాడు-కంగారులో ముంచినాడు
అతడు మనసోదరుడెతల్లీ మనకు తోబుట్టువేనమ్మా॥మనది॥

మనకు కత్తులులేవు-మరఫిరంగులులేవు
మనమెట్లు చేయగలమనకూ
మనము దుర్బలుల మనబోకూ
యుద్ధమంటే భీతిగొనకూ
యోధధర్మమ్ము నేమరకూ
మన గెరిల్లా యుద్ధమంత్రమ్ము శత్రులను
మంత్రముగ్ధులచేసి మట్టుపెట్టేస్తుంది
స్వాతంత్ర్య కాంక్షతో చావునకు తెగియించి
యుద్ధతంత్రమునేర్చి యుద్ధభూమికిరమ్ము
ఫాసిజాన్నెగరగొడదాము
ప్రజలశక్తిని చూపుదాము
చైనా గెరిల్లాల సాహసమ్మునుజూచి
రష్యాగెరిల్లాల రణనీతిగుర్తించి
మనరామరాజు నేర్పిన విద్యసాయమున
ఫాసిజాన్నెగరగొడదాము

ఫాసిస్టులరుగో వచ్చారు-పదపదా
భారతావని సంస్మరించి
వీర భారతభూమి గౌరవము గుర్తించి
ఆత్మగౌరవము నాకాంక్షించి-సోదరీ!
మనజాతికోసమై మనహక్కుకోసమై
ఫాసిజాన్నెగలగొడదాము
ప్రజలశక్తిని చాటుదాము
పౌరహక్కులు నిలుపుదాము
మనది భారత దేశమమ్మా ॥మనది॥

— లలిత

## వీరగాథలు

ఆలకించుము । ఆంధ్ర బాలిక
ఆలకింపుము । అనుగుచెల్లెల
కష్టజీవుల । రాజ్యమునకై
కదనమందున । నురికి శత్రు
పిశాచముల । నురుమాడి "జారు"
ప్రభుత గూల్చిన । వీరరష్యా
వీరవనితల । విజయ గాథలు ॥ఆల॥

దేశ స్వాతంత్ర్యోద్యమంబున
శౌర్య సాహస । ధైర్యమేర్పడ
జూపి బానిస । తనము బాపిన
టర్కి వనితల । వీరగాథలు ॥ఆల॥

వేడిరక్తము । ధారపోసి
గుండ్లదెబ్బకు । గుండెలిచ్చి
ఖ్యాతి గొను । ఈజిప్టు వనితల
వేడి గూర్చెడి । వీరగాథలు ॥ఆల॥



దేశ బానిస । తనము బాపగ
తెగువతో యుద్ధమున నురికి
జపాను రాక్షసి । క్రూరదాహము
కూల్చు చైనా । యువతిమండలి
వినుతిగాంచెడి । వీరగాథలు ॥ఆల॥

ద్రోహి ఫ్రాంకో । ధాటి గూల్చగ
సంగరంబున । నురికి శత్రుల
చక్కడంచెడి । స్పెయిన్ యువతుల
వేడి గూర్చెడి । వీరగాథలు ॥ఆల॥

— కొటిపల్లి వెంకటరత్నం.

## రారమ్మ

(రఘురామనామ స్మరణామృతపానమె అనుమాదిరి)

వీరమాతలను సంస్మరించుటకు వేగమె స్త్రీలికరారమ్మ
దాగియున్న మనదాస్యము తొలగదు తథ్యముయికలేవండమ్మా ॥వీ॥

1. ఝాన్సిరాణియగు లక్ష్మిబాయి మన జాతిలొ స్త్రీయనిగనరమ్మా
ఝళిపించెను తన కత్తితళుక్కును శత్రుల జంపెను జంకక లొంగక ॥వీ॥

2. దుర్గారాణి రుద్రదేవి మల్లమదేవుల శౌర్యమును నిర్మలముగ
హృదయమ్మునదలచుడి వీర ఆంధ్ర నారీమణులు ॥వీ॥

3. భారతదాస్యము బాపుటకొరకై ధారవోసిరి రక్తమును
వీరమాతలని పేరునొందిరి భరత చరిత్రలలో ॥వీ॥

4. నాజీమూకల నరికివేయుటలు రష్యాస్త్రీలకె తగునమ్మా
విశ్వమానవ స్త్రీలందరు తమ విధులవియేయని గనరమ్మా ॥వీ॥

5. ప్రజాయుద్ధమున స్త్రీలెందరొ తమ ప్రాణములర్పించిరిసుమ్మా
ప్రజాశక్తియను పత్రికచదివిన ప్రపంచచిత్రము తెలుసమ్మా ॥వీ॥

6. చెలరేగెనుగా విమానదాడులు కలకత్తా చిటగాంగులపై
చెలియలారమనశక్తినిచూపెడి సమయంబిదెయనితెలియుడిమహిళలు॥వీ

7. స్త్రీల సంఘమును స్థాపించుటకై స్త్రీలు ధైర్యమును చూపండి
స్వతంత్ర్యజండా నెగరవేయుటకు సిద్ధముకం డొకపద్ధతితోడను ॥వీ॥

— వి. యేసుదాసు.

## అభివృద్ధిమార్గాన నడిచిపోదాము!

సోదరీమణులార స్థిరచిత్తులార
చెప్పేటి మాటలను శ్రద్ధగావినుడీ॥

చదువు సంధ్యలులేక సంస్కారణలేక
గాఢాంధకారములో కుములుతున్నాము॥

విజ్ఞానమేమిటో అజ్ఞానమేదో
తెలుసుకోలేనట్టి స్థితిలోనున్నాము॥

పాతివ్రత్యంబంచు ఆచారమంచు
పనికిమాలినపనులు విడువకున్నాము॥

పతిపిచ్చివాడైన భ్రష్టుడేయైన
ఎంతైన పెనిమిటికి ఎదురాడరాదు॥

స్త్రీ అందగత్తైన సుగుణవతియైన
పరస్త్రీలగోరుటలు పూరుషత్వంబు॥

అని ధర్మపన్నాలు పూరుషులు జెపితె
పతివ్రతలకంతెయని పాటించినాము॥

స్త్రీలు చదువగరాదు చర్చించరాదు
గడపదాటి బయటి కరుగరాదంచు॥

శాస్త్రాలువ్రాశారు వలలుపన్నారు
స్త్రీల విజ్ఞానాన్ని చంపివేశారు॥



అత్తింటికోడలవు కావంటెనీవు
ఆజ్ఞశిక్షలు రెండు లేవంటెనీకు॥

అంచు అదమాయించి వంచివేశారు
కిక్కురుమనకుండ గొంతు బిసికారు॥

దాసివలె పనిజేసి రంభవలె మెలగి
ఎంగిలాకులునాకి బ్రతుకమన్నారు॥

ఈవిధిగ స్వార్థపరు లాజ్ఞలను బెడితె
పరమ ధర్మాలంచు నాచరించాము॥

కష్టాలుగలిగితే కర్మమన్నాము
ముక్తివస్తుందని మిన్నకున్నాము॥

విజ్ఞానమార్గాల నెవరైన జెబితె
విరగబడి వారలను వెక్కిరించాము॥

ఈవిధిగ స్త్రీజాతి వెనుకబడిపోతె
సంఘమంతా చివికి చచ్చుదౌతుంది॥

స్వేచ్ఛలేనిస్త్రీలు బ్రతికేమిఫలము
పంజరములో చిలుక కులికేమిఫలము॥

వాసనలేని పూవు పూసేమిఫలము
చదువులేని చాన బ్రతికేమిఫలము॥

సారమెరుగని చదువు చదివేమిఫలము
ఫ్యాక్టరీ అన్నంలో పసయేమిగలదు॥

ఘోషాలలో స్త్రీలు చదివేమిఫలము
అడవిలో మల్లెలు పూసేమిఫలము॥

కుక్క గౌరియటంచు గొలిచేమిఫలము
భ్రష్టుణ్ణి భర్తగా వలచేమిఫలము॥

చెరుకు తుదివెన్నులో రసమేమిఫలము
ముసలాడు మొగుడైతె సుఖమేమికలదు॥

చవిటిలో విత్తనము నాటిఫలమేమి
గ్రామకుంకుమనోము నోచిఫలమేమి॥

ప్రాణాచారంబడితె బిడ్డ బుదతార
భుక్తశేషం తింటె ముక్తివస్తుందా॥

గుడ్లగూబకు వెలుతు రిష్టమోతుందా
స్వార్థపరులకు మంచి పనికివస్తుందా॥

కాబట్టి కష్టాలు పోగొట్టుకొనగ
బుద్ధిమతులౌ స్త్రీలు బయలుదేరాలి॥

మంచిచెడ్డలనెరిగి సంచరించుటకు
చదువుకొనుటకు స్త్రీలు సాగిరావాలి॥

పిచ్చి ఆచారాలు సాంప్రదాయాలు
విడనాడి స్త్రీలంత వృద్ధిపొందాలి॥

ఖడ్గాలు ధరియింప కవితలల్లంగ
శాస్త్రాలు నేర్వంగ స్త్రీలు రావాలి॥

లేకుంటె స్త్రీశక్తి నీరసిస్తుంది
అంతటితొ జాతంత పతనమౌతుంది॥

కాన వేగమె మీరు సాగిరారమ్మా
అభివృద్ధి మార్గాన నడచిపోదాము ॥సోదరీ॥

— ముక్కామల నాగభూషణం.

## మంత్రాలలో ఏమివుంది ?

మంత్రాలలోనేమి మహితశక్తుంటుంది - మాంగల్యసూత్రాల మహిమేమి కలదు- వింతపోకడలింక వదలివేయాలి- అభివృద్ధిమార్గాన నడచితీరాలి॥

అలివేణికుండలకు దండాలుబెట్టితే
కాషాయగుడ్డలతొ కాశియాత్రలు జేస్తె
భాషికము నుదుటిపై బాగబిగియించితె
పాదాలపై మంచి పారాణి బెట్టితే
ఆయురారోగ్యాలు గలిగి వర్ధిల్లునా-ఆమీద రోగాలు రాకుండబోనా॥మం॥



శాస్త్రాలు తిరగేసి లగ్నాలు బెట్టినా
సంకల్ప మంత్రాల ముడుపుజెల్లించినా
సౌమిత్ర కట్నాలు చక్కగా యిచ్చినా
ఆశీస్సులెంతెంత అధికముగ బొందినా
భార్యభర్తలమనసు లేకమయ్యేనా-ఈడుజోడుగ బ్రతుకజాలగానౌనా ॥మం॥

వరకట్నమెంతగా చదివించియిచ్చినా
ఘనమైన నడవడులు అడుగడుగు నడచినా
బ్రహ్మబంధపుముడులు పట్టిబిగియించినా
విధ్యుక్తముగ సప్తపదులు నడపించినా
విడకుండదంపతులనడసింపగలవా-హృదయకల్లోలములసమయింపగలవా॥

పిచ్చి ఆచారాల నెట్టివేయాలి
యువతియువకులె పెండ్లినెంచుకోవాలి
ఆశయా లిరువురివి ఏకమవ్వాలి
విజ్ఞానమిరువురకు వృద్ధిబొందాలి
అట్టిపెండ్లియె ప్రజలకాదర్శమౌను-అనాడె అభివృద్ధిగాన్పించుగాని ॥మం॥

— ముక్కామల నాగభూషణం.

## పడలేము ఆచారబాధ

పడలేము ఛాందసులబాధ ॥ దేవ ॥ పడలేము ఆచారబాధ

స్త్రీ చదువరాదంటు చెడ్డవాదనచేసి అజ్ఞానమును పెంచుతారు । జగతి విజ్ఞానమును చంపుతారు । "విజ్ఞానమును పెంచు విద్య" ప్రాజ్ఞులంటె కొట్లకుక్కలలాగ కరువంగవస్తారు ॥పడ॥

కట్నాలకాసించి - కాపురుషులకునైన - సూత్రాల బంధించుతారు । వధువు మాటల గణియింపబోరు । మగువ సౌభాగ్యమును చూడబోరు । "ఇట్టి పందలతోడ ఎట్లు కాపురమంటె" శాస్త్రాలు, కర్మయవి జరిపించి చెపుతారు ॥పడ॥

పతిగ ముదుసలిగట్టి పరిణయమాడించి డబ్బువందలు గుంజుతారు । మాదుసుఖదుఃఖముల నెంచబోరు । మమ్ము బలిజంతువుల్లాగ బలిపెట్టుచున్నారు ॥పడ॥

బాల్యప్రాయమునందె పరిణయాల్ చేయించి బాల విధవలజేసారు ।
మాదు సౌభాగ్యమును చంపుతారు । పెండ్లి మాటను ఎత్తంగబోరు ।
"చచ్చే ముదుసలినైన శాస్త్రమొప్పె పెండ్లి మాకొప్పదా" అంటె ।
మెడ పిసుకవస్తారు ॥పద॥

స్త్రీబయటకడుగిడితె చెడిపోవునంటూనె వంటింట్లొ బంధించుతారు ।
మాదు స్వాతంత్ర్యమును చంపుతారు । "స్వాతంత్ర్యమే మాకు జన్మ
హక్కు" అంటె బ్రహ్మరక్కసిలాగ విరుచుకుపడతారు ॥పద॥

పశుజాతి పద్ధతిని భార్యయుండగ భార్య మగవాడికే ఒప్పునంట ।
బాలవిధవాల కదిఒప్పదంట । "మగువామాత్రము తాను మనిషికాదా"
అంటె "మదమ? మదమ" యంటు గదమాయించుతారు ॥పద॥

వారకాంతల మరగి ధనమెల్ల వ్యయపెట్టి డబ్బు తెమ్మని చంపుతారు ।
తీవ్ర నిర్బంధములబెట్టుతారు । పుట్టింటికడ డబ్బు పుట్టకపోతేను
వరకబాధలమించు నరకంబు మాబ్రతుకు ॥పద॥

రాజ్యాలు సృష్టించి ।
రాజ్యమేలినమేము ।
వేదాలు రచియించి ।
వినుతి కెక్కిన మేము ।
యుద్ధ మైదానాన ।
హుంకరించిన మేము ।
ఎన్నాళ్లు మౌఢ్యమున ఈలాగు
నుండేము ॥పద॥

— శెట్టిపల్లి వెంకటరత్నం

## స్త్రీని చూడక పోతే

అగునా సత్కీర్తి
సాగునా రాజ్యాలు
స్వాతంత్ర్య ప్రతిమ యన



దాన నెంచకపోతె
భరతఖండము పారతంత్ర్యాన కుములదా
భూదేవి । మార్మోగ్రిత ఘోషిల్లిపోవదా ॥అగు॥

పరద దాటే రమణి
బయట కరిగిన దంటె
చెడిపోవునని చెప్పి
స్త్రీని అవమానిస్తె
అగ్నిజ్వాలలు అంత ప్రజ్వరిలి పోవవా ।
ఆనంద సౌభాగ్య । మడుగంటిపోవదా ॥అగు॥

ధనమమత్వపు కాంక్ష
దగిలి పసితనమందె
బండ మూర్ఖుల కిచ్చి
పిల్లలను ఏడ్పిస్తె
సప్తాంబుధులు పొంగవా । పుసురుచే
ఈరేడు లోకాలు ఘోషిల్లిపోవవా ॥అగు॥

స్త్రీ వీర మూర్తియై
చేత ఖడ్గము దాల్చి
సంగరంబుల శత్రు
సైన్యాల బరిమార్చి
చెండాడ కుండేను
స్వాతంత్ర్యమే వచ్చునా । దేశాన ।
వీరత్వమే నిల్చునా ॥అగు॥

చిన్నబిడ్డలు కరువు
చేత అల్లలలాడ
ఘన దరిద్రము ఇంట
కాల్చి పారేస్తుండ
పరితాప పడు భాగ్య
రాసి చూడకపోతె
సౌభాగ్యమే నిల్చునా । ప్రకృతిని
సిరి సంపదల్ నిల్చునా ॥అగు॥

చదువు చదివిన దాన
చెడునంచు మూర్ఖులై
తప్పుడూ వాదముల
తరుణులన్ వెలిబెడితె
విజ్ఞాన మడుగంటదా । దేశాన ।
మౌఢ్యంబు తలయెత్తదా ॥ఆగు॥

— శెట్టిపల్లి వెంకటరత్నం

## స్త్రీ సంఘాలు

('రైతుకే ఓటివ్వవలెనన్నా' అనుమాదిరి)

స్త్రీల సంఘము లేవవలెనమ్మా మన భావిభారత నారిలోకము
మేలుకొనునమ్మా స్త్రీల సంఘము లేకనే యీ భారతీ మణు
లూరుకుంటే దారి తెలియక సంఘమునకే దూరులై పోయెదరు
గావున ॥స్త్రీల సంఘము లేవవలెనమ్మా॥
చచ్చు సంఘము మార్చ వలెనమ్మా మాయ జూదరి
హెచ్చుతగ్గులు మంటగలపమ్మా చచ్చుసంఘము మార్చకనే
యీతుచ్ఛజీవన పథమెవుంటే, పిచ్చ స్త్రీలకు ఏమి తెలుసని
వుచ్చులో దింపెదరు గావున ॥స్త్రీ॥
దేశమునకయి తేరిచూడమ్మా - మనదాస్యశృంఖల పాశముల
తెగ ద్రెంపివేయమ్మా - దేశమంటే తెలియకయె యీ నీచ
జీవన పథమె పట్టిన దాస్యమున నారీమ తల్లులు నాశమై
పోయెదరుగావున. ॥స్త్రీ॥
స్త్రీలుకూడా మానవులె అమ్మా - విజ్ఞానమందున నోలలాడిన
స్త్రీలు గలరమ్మా - స్త్రీలుకూడా మానవులె యని పాలకులె
దిగ్భ్రమ జెందగ ఏలియున్నది - విజయలక్ష్మీ వీరజహ్వారి
సోదరీమణి ॥స్త్రీ॥
మాతృదేశపు తలపు నిలుపమ్మా - ముల్లోకములకు ముత్యమైనది
భరత భూమమ్మా - మాతృదేశపు దాస్యబంధము దగ్ధమూ
చేయాలి రమ్మని - దేశమందున యువతులకు సందేశము
వినిపించవలెనమ్మా! ॥స్త్రీ॥

—యం. భగవంతరావు.



## ఓ భరత నారీ!

1. ఎండలే ఎరుగనీ ఘోషాల ముసుగుల్లో
కాంతులే చూడని వంటింటి పొగలలో
కుళ్లుతూ, కుములుతూ, కందుతూ, కుందుతూ
ఎన్నాళ్లు గడిపేవు? ఓ పుట్టుబానిసా!
ఎన్నాళ్లు కుమిలేవు? ఓ భరతనారీ!!
మేలుకో! మేలుకో!! మేలుకో!! మేలుకో!!

2. పురుషజాతికి నీవు ఆజన్మదాసివా?
బిడ్డలను కనిపెంచె మూగ యంత్రానివా?
కామవాంఛను తీర్చు కీలుబొమ్మైనావు!
పరదాలమాటునే పాలిపోతున్నావు!!
చీకట్ల తెరలలో అంధకారపు బ్రదుకు
ఎన్నాళ్లు గడిపేవు? మేలుకో! మేలుకో!!

3. పాత పురాణాల మూఢ వ్యవస్థలో
చైతన్య రాహిత్య నికృష్ట జీవనం!
విధివిరామంలేని కాయకష్టంలోనె
కాలగర్భములోన కలసిపోతున్నావు!!!
ఓ మూగ బొమ్మా! బానిసకు బానిసా!!
మేలుకో! మేలుకో!! మేలుకో!! మేలుకో!!!

4. విశ్వగోళపు వివిధ దేశాల దేశాల
స్వాతంత్ర్య గేయాన్ని నీ సోదరీమణులు
ఎలుగెత్తి పాడేరు! గొంతెత్తి చాటేరు!!
స్వేచ్ఛా సమత్వాల ఆ జన్మహక్కుకై
సంద్రాలు కొండలు దద్దరిల్లేలాగా
విప్లవ నాదాల్ని ఎలుగెత్తి పలికేరు!

5. అబలవో, సబలవో, అనుచు నిన్నాళ్లుగా
చరితకారుడు నిన్ను శంకించుచున్నాడు!
కను తెరచి కాంచవే ఓ వీర పుత్రీ!

చైతన్య స్రవంతులన్ పూరించి, పొంగించి
విప్లవజ్వాలలన్ వినువీధి నెక్కించి,
వుద్యమాల్ వుత్సవాల్ వూగించి, సాగించి,
వేలాది వేలానే, కోటాన కోట్లనే
అదలించి, కదలించి, నడిపించి, ఉరికించి
కదనసీమకు దారి త్రొక్కవే సోదరీ !!

6. నీ జాతి రత్నం-ఝూన్సీ మహారాణి
కదన తురగమునెక్కి-పదును ఖడ్గము నెత్తి
కొదమ సింగపు రూపు-శౌర్యపటిమను చాటి,
ప్రథమశ్రేణిలో నిలచి-పగతురను వెంటాడి,
పట్టి చీల్చినగాధ-మరపురానియోధ
స్మృతిని వీడనిగేయం! సరకు సేయని గాయం!
శిలా శాసనరూపం !! సువర్ణాక్షర లిఖితం !!!

7. మల్లమాంబాసతీ మరణ సందేశం
వీర జోయాకన్య అజరామరత్యాగం
ఫ్రెంచి జోనాదేవి తుది వీరగేయం
నీ కర్ణపుటములన్. నీ మనో వీధుల్లో
నీ హృదయ కుహరాన. నీ వ్యధిత హృదయాన
రింగు రింగున మ్రోగి మార్మోతలే వెట్టి
ఉప్పొంగి, వుప్పొంగి వినువాకగా పొంగి
ఉద్రూత లూగించ, వుల్లాసమున ముంచ
మేలుకో! మేలుకో !! ఓ భరతనారీ! ఓ వీర పుత్రీ !!

8. నీ చూపు మేరలో చైనీయ సాహసం
నీ ముందు బాటనే-సోవియట్ శౌర్యాగ్ని
నీ వెనుక చూపులో-స్పానిష్ సందేశం
నీ కళ్ళముందటే కొరియన్ లలనలఘోష
ప్రాగ్దేశ స్త్రీజాతి ప్రాచీన ఔన్నత్యం
కణము కణమున కలసి, అణువు అణువున కరగి
వేడి రుధిరంపొర్ల వుప్పెనగ సాగగా



ఎర్రజెండా క్రింద ఏరువాక గావాలి
ఫాసిస్టు రాక్షసుల పారద్రోలను లే!
శాంతి సౌఖ్యా లిపుడే స్థాపింప రా !! ॥మేలుకో॥

— మునిపల్లె రాజు

## మొట్టికాయలు

ఆడవాళ్ళమని అనాధలము అని
అనుకోవలసినపని లేదింకా
అబలలమని మన నదనపుదయతో
అదిమిపెట్టినార లింతకాలము
అదనపుదయ మనకక్కరలేదు
అబలులము మన మసలేకాదు.
లేలెండమ్మా! లెండిముందుకూ
బేలతనంబును పిరికితనంబూ
ఆడవాళ్ళకూ అసలేలేవని
చాటించేటి సమయమొచ్చినది
ఫాసిస్టులు మన పవిత్రభూమిని
కబళించుటకై కాచియున్నరా
పచ్చిరాక్షసుల ఫాసిస్టువెధవలు
అడుగుబెట్టినచో ఆడువారమే
మొట్టికాయలను బెట్టిపంపుటకు
లేలెండమ్మా! లెండితొందరగ!

—గొట్టిపాటి నారాయణమ్మ.

## స్వాతంత్ర్యం సామాన్యమా?

సామాన్యమటమ్మా, స్వాతంత్ర్యము సమకూరుట సామాన్యమటమ్మా॥

1. యువతులందరు ముందు కదుగువేయాలి
స్వేచ్ఛకై రణరంగమందు నురుకాలి
ధైర్యముగ త్యాగాలుజేసి తీరాలి
శౌర్యగాధల నెరపి జయము పొందాలి ॥సా॥

2. ఈనాడె స్త్రీ లందరేకమవ్వాలి
నానాట అభివృద్ధిజెంది నడువాలి
ధారాళముగ శక్తి ధారపోయాలి
పోరాటముల మధ్య పోరి గెలువాలి ॥ సా ॥

3. స్వార్ధాన్ని విడనాడి సంచరించాలి
అధిక లాభాపేక్ష అణచివేయాలి
వ్యర్థమౌ కోర్కెల్ని విడుచుకోవాలి
స్పర్ధవిడి సర్వజన సమతచాటాలి ॥ సా ॥

4. అస్త్రవిద్యలయందు ఆరితేరాలి
శస్త్రాన్ని చేబూని సాముచేయాలి
ఝాన్సివలె పోరాడి కీర్తి దేవాలి
• గున్నమ్మవలె నిలచి గుండెలీయాలి ॥ సా ॥

5. దేశాన్ని రక్షింప దీక్ష బూనాలి
ఫాసిస్టులను జంప ప్రతిన బట్టాలి
శత్రువులజంపి గెలుపైన పొందాలి
మాతృరక్షణ కాహుతైన గావాలి ॥ సా ॥

6. రాజకీయాలలో రాటుదేలాలి
నిజపరిస్థితుల నూహించగలగాలి
ప్రజలనందనైక్యపరచి నిలుపాలి
నిజమైన ఐక్యతలో విజయమందాలి ॥ సా ॥

7. ఐక్యతగ ఫాసిజాన్నెదురుకోవాలి
ఐక్యతగ స్వాతంత్ర్య మందుకోవాలి
ఐక్యతగ యుద్ధాన్ని గెలుచుకోవాలి
ఐక్యతగ స్వేచ్ఛని అనుభవించాలి ॥ సామాన్యమటమ్మా ॥

— ముక్కామల నాగభూషణం

• గున్నమ్మ మందసాయెస్టేటులో పోలీసులనెదుర్కొని తుపాకిగుండ్లకుబలైంది.



# జోలపాట

ఏడువకు పసిబాల యేడువకు తండ్రీ-యేడిస్తె నిను భరత వీరుడనరయ్యా!
ఏలయేడ్చెదవురా నాచిన్న తండ్రీ కలలోన ఫాసిస్టులనుగాంచి యేడ్చితివా?
ఫాసిస్టు రాక్షసుల పీచమడచుటకు ప్రజలు కలరింక భయమేల యేడవకు॥
అసురుడౌహిట్లరు అమర రష్యాపై దండెత్తెనంచు భయమంది యేడ్చితివా?
హిట్లరును చంపుటకు యెర్రసైన్యంబు వీరుడౌ స్టాలిను గలరుయేడవకు॥
జపాను సైన్యాలు చైనాలోజేరి చేసేటి హత్యలకుజడిసి యేడ్చితివా?
జపానుహంతకుల గొంతుకలగోసి చైనీయులే గెల్చుచుండి రేడవకూ॥
ప్రియమైన నీ మాతృభూమిపై దుముక చేరివచ్చు జపాను చూచియేడ్చితివా?
జపాను గుండెల్ని చీల్చిగెలుపొంద కోటానుకోట్ల ప్రజగలరు యేడవకూ॥
స్వాతంత్ర్యమేలేని బానిసప్రజలూ దేశరక్షణ చేయలేరనేడ్చితివా?
ఐక్యతగ ప్రజలంత నిలచిపోరాడి స్వాతంత్ర్యమును పొందగలరుయేడవకు॥
ఇంకేల యేడ్చెదవురా తండ్రీ ప్రజలైక్యతలేదంచు యేడ్చితివా?
కలరు కమ్యూనిస్టు వేలాదివేలూ ప్రజల కలయికను దేగలరుయేడవకు॥
ఫాసిస్టు వ్యతిరేక దేశభక్తులను బంధింపగా దిగులుజెంది యేడ్చితివా?
ప్రజల వత్తిడివల్ల పరప్రభుత్వంబు దేశభక్తులవిడచి తీరునేడువకు॥
ప్రియమాతృదేశాన్ని పరులకమ్ముటకూ దేశద్రోహులు గలరటంచుయేడ్చితివా?
ద్రోహులకు దగినట్లు బుద్ధిజెప్పుటకు దేశభక్తులు ప్రజలు కలరుయేడువకు॥
యింకెందుకురనాన్న అట్టులేడ్చెదవు స్త్రీల ఘోరవిపత్తులదలచి యేడ్చితివా?
ఆత్మరక్షణమార్గమరసి పోరాడ స్త్రీలు సిద్ధముగనున్నారు యేడువకు॥
శీలరక్షణకు ప్రాణాలు విడచుటలు భారత స్త్రీసాంప్రదయ మేడువకూ॥
దేశాన్ని రక్షింప దీక్షబూనారు వీరవనితలు భయమదేల యేడువకు॥
స్త్రీపురుషులందరునుచేరి పోరాడి స్వాతంత్రమును బొందగలరుయేడువకు॥
కిలకిలానవ్వేవు కేరికులికేవు ఇదియటర నీకోర్కె నాచిన్నికన్నా!
ఇంకనిద్దురబోర నాచిట్టితండ్రీ వేళాయేరా సభకు నేనేగవలెను

॥లాలీ (లేక) జో జో॥

— ముక్కామల నాగభూషణం

# తరుణం వచ్చింది!

స్త్రీలో అణగిన స్వతంత్రజ్యోతి,
ఆమెలోని విశేషప్రతిభ,
నీవా? నేనా? అనిచూపించే
　సమయంవచ్చింది అదిగో
　తరుణంవచ్చింది!

ఏనాడో మరచినశౌర్యం,
ఏనాడో కోరినస్వేచ్ఛ,
ఏనాడో అడిగినస్వత్వం,
　రగిలించే సమయంవచ్చింది!
　ప్రబలించే తరుణంవచ్చింది!

నాడూ, నాడూ, కవి, విననట్టి
విషాదమయ ప్రమాదసమయం,
స్త్రీజాతికి విమోచననిమేషం,
　ఆదిగో వచ్చిందితరుణం
　అదిగో వచ్చింది!

ఏదని? స్త్రీలోకమడిగితే—
ఫాసిస్టుల ప్రమాదచర్యలు,
నాజీజం విషస్వభావచరితం,
　తెలిసి, తెలిపే సమయంవచ్చింది!
　నశింపజేసే సమయం వచ్చింది!

స్వార్థీ, సోమరి, కుటిలమనస్కుల,
దయలేని విమూఢఘాతకుల,
ప్రగాఢ ప్రహరణహతులనుజేసే
　సమయంవచ్చింది అదిగో
　తరుణంవచ్చింది!.



దగ్గఱలో మరిదగ్గఱలో
సమీపంబున సాయుధాలతో,
పొంచిఉన్న ఫాసిస్టుఘాతకుల,
　కృశింపజేసే సమయంవచ్చింది
　నశింపజేసే తరుణంవచ్చింది!

దూరంలో మరిదూరంలో
ఐక్యమైన వివిధప్రజాశక్తితో
అలరుతున్న స్వతంత్రశక్తుల
　ప్రబలింపజేసే సమయంవచ్చింది
　రగిలింపజేసే తరుణంవచ్చింది!

పోయినవిభూతి సాధించాలన్నా
అణగినదీప్తులు రేగాలన్నా
ప్రజాపతాకం ఎగరాలన్నా
స్వతంత్రకాంతులు ప్రబలాలన్నా
　ఇంతకంటెసమయం ఇకనెప్పుడురాదు
　దీవికన్నతరుణం మరివెన్నడురాదు!

స్త్రీలందఱు వెనువెంటనెలేచి
వైరిరక్తమును వీధులజల్లి
వైరిఅస్తులను సున్నంకొట్టి
ముచ్చటగా ముగ్గులుతీర్చే
　సమయంవచ్చింది అదిగో
　తరుణంవచ్చింది!

—డాక్టరు రాంబాబు,

# హెచ్చరిక

రాకండోయ్, ఫాసిస్టుల్లారా!
పాతేస్తాం, భడవల్లారా!
　దుర్బుద్ధులతో మీరిక్కడికొస్తే-
　దునిమేస్తాం, దుష్టుల్లారా!

దురంతాలను మీదిక్కడచేస్తే-
దుంపతీస్తాం, ధూర్తుల్లారా!

విజ్ఞానాన్ని వినాశనానికి;
అమాయికులనూ, పసికత్తులపైకి;
మాతాశిశువుల మారణభూమికి;
పంపించే మీరిక్కడికొస్తే-
పాతేస్తాం, పాపుల్లారా!
దురాక్రమణకు అంగలువేస్తే
పరాక్రమిస్తాం ఫాసిస్టులారా!

రక్తపిపాసకు మీ అట్టులకందిన;
కామతృష్ణకై మీ చేతికిలొంగిన;
దోపిడికై మీకన్నులబడిన;
పోలండు, హాలండు, ఫ్రాన్సాయిది?
మలయా, బర్మా, సయామాయిది?

పురాతత్త్వమున గణనమందిన;
విజ్ఞానానికి విలాసమైన;
శౌర్యసంపదకు పేరునందిన;
వీరభూమియిది పిశాచులారా!
భారతావనిది ఫాసిస్టులారా!

ఏమో, ఏమో, చెబుతున్నామని;
మందబుద్ధితో మీరిక్కడకొస్తే-
"వీళ్లెంతా మాబాంబుకు పిసర"ని;
పరుగెత్తుకు మా మీదనుపడితే-
మీనరాల్లోరక్తం:
మాగుమ్మాల్లో కళ్లాపికావడం;
మీఎముకల్లోసున్నం:
మాగుమ్మాల్లో ముగ్గులుపెటడం;
నిజం! నిజం!! నిజం!!!

—డాక్టరు రాంబాబు.



# పిలుపు!

అక్కల్లారా! చెల్లెల్లారా!
అమ్మల్లారా! అప్తుల్లారా!
రారండమ్మా! రారండీ!
రండీ! రండీ!! వైరులదునుమగ —
రారండమ్మా! రారండీ!
మనమున్నది బానిసస్థితిలో —
మనజీవిక అంధయుగంలో —
మనసంపద విదేశాలలో —
మన విజ్ఞానం మూఢులవద్ద —

ఉండే ఈవిషాదయుగంలో —
క్రుంగే ఈచీకటిచాటున —
మనమీదకు ఒకభూతంలేచింది.
ప్రాక్పశ్చిమదిశావీధులను,
పదత్రొక్కే ఫాసిస్టుశక్తిని —
కరుణారహిత కర్కశవైరిని —
దునుమాడగ మీరందరురండీ!

భారతభూమిని వనితామణులు
బానిసలై బ్రతుకుతున్నను.
ఫాసిస్టురాక్షసుల పరిమార్చగను,
మనశక్తికి సాటేలేదు —
మనదీప్తికి ఎదురేలేదు.
మనధైర్యం మనదేశంకోసం
మనఐక్యత మనస్వతంత్రంకోసం
మనసంపద మనజీవికకోసం

ఉపయోగించగ రారండమ్మా!
రారండీ! రండీ! రండీ!
అక్కల్లారా! అమ్మల్లారా!

రానున్నది ప్రమాదసమయమని
కానున్నది విజయప్రధానమని
ఏమైనా ఎదురెవరులేరని

స్త్రీజనమంతా రారమ్మా!
రారండమ్మా! రారండీ!
శత్రువుమన భూస్థలిపైమోపే —
తుచ్ఛవైరులు మనమీదనువేసే —
అడుగైనాసరే, బాంబయినసరే —

తిరిగిగొట్టి వైరితిరోగమించగ
స్త్రీశక్తిజూప స్త్రీజనమంతా
రారండమ్మా! రారండీ!
రండీ! రండీ! వైరులదునుమగ
రారండమ్మా! రారండీ!

—పట్నాల ఉమాగాయిత్రి.

## మంగళం మాతా

మంగళం మాతా
జయమంగళం మాతా॥
శౌర్యకీర్తి సుమపరిమళముల శోభిల్లు జగన్మాతా॥
శూరవరులుగలరూ - శౌర్యోత్సాహవతులు గలరూ॥
దాస్యశృంఖలాల ద్రెంచి నీ ఋణముదీర్చువారుగలరూ॥
త్యాగధనులుకలరూ - విజ్ఞానఘనులుకలరూ
సర్వప్రపంచము నందున - చరితజాటువారు గలరూ॥
స్వేచ్ఛనందగలరూ - సమతనుసాధించనుగలరూ
వినువీధులలో - విజయపతాకము నెగరవేయగలరూ॥
హారతిదేమాతా - పుష్పాంజలులిదేమాతా
శౌర్యసుమంబుల - ధర్మవాసనలజిమ్ము భరతమాతా॥

| | |
|---|---|
| ఫాసిస్టువ్యతిరేక గీతాలు | 0—6—0 |
| చైనా గెరిల్లాయోధులు | 0—5—0 |
| విమానదాడి - మన కర్తవ్యం | 0—6—0 |
| టాన్యా | 0—6—0 |

ప్రజాశక్తి కార్యాలయం

: : బెజవాడ : :